# దిరసన్న

వెన్నెలకంటి రాఘవయ్య

మావూళ్లో రెడ్డోరికి నాయుడోరికి పారిటీలు పడ్డాయి. సుందర్రెడ్డి జిల్లా బోర్డు నెంబరైన పాట కూతురికి పెళ్లి చేసి అల్లుడికి రోడ్డుమోటారు కొనిచ్చాడు. ఆమైన కారు రావటానికి ఊళ్లోకి రస్తా వేయించాడు. దాన్తో అధికార్లు రావడం పోవడం రామంద్రాళి అయిపోయింది.

తాశీల్దారుణ్ణి చూస్తే మారెడ్డి అంతకు మునుపు లేచెరగడు. ఇప్పుడు బిళ్లా బంట్రోతొచ్చినా సరే చేతులు కట్టుకోవాల్సిందే. ఇన్నాళ్లు ఇస్తరాకు మజ్జిగ నీళ్లుపోసి యెటువంటోరినైనా లొంగదీసుకుంటుండి నోళ్లకు యిప్పుడు బలేయాసకాటం అయిపోయింది. వచ్చే కార్లకు పొయ్యే కార్లకు యిధీ యిరగడా లేనేలేదు. పాపం ఒకందుకేసిన రోడ్డు ఉంకో అందుకు అక్కరకొచ్చింది. మొత్తానికి అల్లుడి పుణ్యాన అరమైలు దూరం మొల్లోతు బురదలో నీళ్లల్లో యీదుకుంటూ గుడ్డపాతలు ఎగబట్టుకొనిపొయ్యే కష్టం మాలోళ్లకు తప్పింది.

పండగెల్లిన మరసనాడే పల్లాపుచేలో యేశారు రెడ్డోరికి పదిపుట్ల ఈసనకోరు కుప్ప. ఉత్తరాదోళ్లు పొల్లబడేటికి ఉండూరు కూలోళ్లకు ఉన్న కూలీకూడ పోయింది. మంది యెక్కవైతే మజ్జిగ పలసబడతాయన్న సామెత. నాటేతరాకతలికి, కలుపు కర్రలు పెరుక్కుంటూ యాడాది పొడగాన కడుపు తడుపుకుంటూ ఉండినోళ్లకు ఇప్పుడు పట్టుమని పదిదినాలు కూలి దొరక్క మడత కుడుములు తప్పడం లేదు. ఆ యిచ్చేకూలైనా పిచ్చబొచ్చతో కొల్చిన తాలూ తరకానిండిన వాగుతల గింజలే.

రెడ్డోరి నూరు యెకరాలు ముందాడే మొలగొలుకులేస్తారు. ఒక్క మడకకిందనే పారుదల. ఒక్కటే చదరకట్టు. మాదిగయామడికి తాతల నాటి నుండి ఉండిన అరఎకరా సగిలి చేసుకుని లోకి కలుపుకున్నప్పటి నుండి చదరకట్టుగానే ఉన్నది - ఎందరివో పేదసాదల యిండ్లు నేలచదరమైనా -

అమాస రేత్రి జాము పొద్దుకు పైబడింది. కన్ను పొడుచుకున్నా కనపడని గబ్బుగీము. దిరసన్న అప్పుడే నాయుడోరి తుంగచేను కుప్ప పరిచిన నూగుకు నిబాయించలేక మాలచ్చిమి కాచిపెట్టిన యేన్నీళ్లు పోసుకోని సందకూడు తిని నోట్లోకి పెట్టించుకోని, గొంగడి మడిచి పైనేసుకోని మీద కుప్ప కావలికి పోయినాడు. ఈదర గాలికి నిదరపట్టలేదు. పక్క నేసుకున్న గడ్డిలో నుంచి కొయ్యకాలు గుచ్చుకుంటూ ఉండింది. దూరాన గుంటకట్టిన యానాది యెంకటసామి గుడిసెలోని సాదె మాత్రం గాలివాటానికి యినబడుతూ ఉండింది, బలకొటుతూవున్న యిల్లాలి కిన్నెర కంఠంతో సహా. చింతమాను తొఱ్ఱలో కూర్చోని రొదపెటుతూ ఉండిన గుడ్లగూబ కూడ దిరసన్నను పలుకరిస్తూ

ఉండింది. కుప్పల కావలిగాండ్ల జాముకేకలు విన్న ఒకటి రెండు పక్షులు రెక్కలను తటతట కొట్టుకుంటూ ఒకటి రెండు చుట్లు చెట్ల కొనలపై చుట్టి మరల గూళ్లలో చేరుకున్నవి.

ఇంతలో రెడ్డోరి నడికుప్పన మంట లేచింది. చుట్టు పక్కనున్న కావలోండ్లు కలదెలుసుకోని లగెత్తేలోకి మంట లగ్గలకు ఎగిసింది. మంటను చూచిన దిరసయ్యా ఒక్క అగాతాన పరిగెత్తి నడికుప్పకు ఎక్కాడు. కాలే పంజుల్ని కాలచాత నలిపి పెటికి పారేశాడు. ఇంతలో రెడ్డోరి తలమాసి కాపుకరణాన్ని ఎంబడేసుకోని కుప్పకాడి కొచ్చాడు. దిరసన్న యేళ్లూ కాళ్లూ కాలిపోయినాయి.

కరకున పొద్దు పొడిచే లోపలనే పోలీసులు వచ్చారు. సాయం త్రానికి దిరసయ్యకు అరదండాలు తగిలించి స్టేషనుకు నడిపించుకోని పోయినారు. చేత గాయాలకు సర్టిఫికేటు తీసుకున్నారు. డిపిటీ కలకటేరు దగ్గిర కుప్ప తగులబెట్టినందుకు కేసు పెట్టినారు.

దిరసన్న నమ్మకమైన మనిషేనని అందరికి తెలుసు. చదవను రాయను దాసరి బుచ్చయ్యా ధర్మాను నేర్చుకున్నాడు. చిన్నచిన్న కాపులు "దిరసన్నా!" అని మధ్యరకంగా పిలిచినప్పటికి అతని కండ్లెదుట బుట్టిన పిల్లయ్యోరు వత్తాసికరణం మాత్రం ఇప్పటికీ "దిరసా" అని "దిరిసిగా" అని పంతానికి పిలుస్తూనే ఉంటాడు, వాడింట వానగురవ.

దిరసన్న భార్య చూలాలు. "నన్నిడిచి పెట్టి యాడకు బోతావు మామా?" అని పెనిమిటి కాళ్లు జవిరి పట్టుకోని కంటికి కడివెడుగా యేడ్చింది. పెద్దమాల పెద్దకూతురు మాలచ్చిమి. దిరసన్న నోట్లో మాట రాలేదు. ఇంతలో పోలీసోళ్లు మెడ బట్టుకోని నెట్టుకుపోయినారు దిరసయ్యను.

దిరసయ్యా నేరం చేయలేదని ఊరంతా అన్నారు. చేయకుంటే చేతులెందుకు కాలినాయని సుందర రెడ్డెమ రచ్చలో కూర్చోని చుట్ట పొగాకును మోకాటి సందన పదును చేసుకుంటూ నెమ్మదిగా అన్నాడు. పోలీసులు వచ్చి మాట్లాడిపోయిరి. తరువాత "చేసినా, చేసుండొచ్చు, నమ్మరాదు గాడిద కొడుకుల్ను" అని అన్నారు నాయుడోరు కూడ ఒకటి రెండు దిక్కల. అసలు జరిగిందేదో పారిటీలు పెట్టే రెడ్డోరి తల మాసికి తెలియకపోలేదు.

కేసు యిచారణ ఆరంభం అయింది.

"నేరం చేసినావా?" అన్నాడు నిన్నటిదాకా తాశీల్దారుగా ఉండిన కొత్త మేస్త్రిటు.

"లేదు నాయనా, అన్నెం పున్నెం ఎరగను" అని చేతులు కట్టుకొని ఎదురుగా నిలబడి ముద్దయి బదులు చెప్పాడు.

"అయితే చేతులెందుకు కాలాయి?"

"మంటలు చల్లారుస్తుంటే"

"ఎదటి పార్టీలో ఉండేవాడివి, చల్లార్చబోయినావంటే ఎవరు నమ్ముతారు?"

"అట్లయితే కుప్ప తగలబెట్టబొయ్యేవాడికి అరికాళ్లెందుకు కాలాల నాయనా? మీరు నెయ్యన్నం తిన్నోళ్లుకదా, చూడండి అరికాళ్ల పుండ్లు ఇంకా మానలేదు."

కలకటేరుకు ఇది సూటిగానే తోచింది. చట్టం లేని కళ్లద్దాలను తీసి ఒకసారి తుడిచి శిగరెట్టు వెలిగించి గాలిలో చక్రాలను చుట్టుతున్న పొగను చూస్తూ కొంచం నిదానించి మళ్లీ పేనా పట్టుకున్నాడు.

న్యాయాధిపతి : - నీ కాళ్ల గాయాలకు సర్టిఫికేటు లేదే!

ముద్దయి : - సొంతంగా సూడండి దొరా.

ఇంతలో పోలీసుల వకీలు బొక్కులు తిరగేసి అందుకు చట్టం ఒప్పుకోదన్నాడు. దానికి మేస్త్రీటు కూడ తల ఊపాడు.

కేసు వాయిదా పడింది. పోలీసు వకీలు శిక్ష తప్పదని తలమాసికి చెప్పినమాట యిన్నది మాలచ్చిమి. నిద్రమంచాన ఏమి తాగిందో చీకటి గంజి, మళ్లీ గంగ తాకనందున కండ్లు గుంటలు పడినై.పుట్టెడు కడుపుతో యిరవైమైళ్లు నడిచి వచ్చింది. డాక్టర్లను బతిమిలాడి కమ్మీల యెనకనున్న పెనిమిటి దాపుకు పోయింది.

అప్పటికి దిరసయ్య జైల్లోపడి నాలుగు నెల్లు. తుమ్మెద రెక్కల్లాగ నల్లగా మెరుస్తూ ఉంగరాలు తిరిగిన దిరసయ్య వెంట్రుకలు తెల్లగా నరసిపోయినాయి. నిద్ర యెరగని కండ్లూ చీరపోతుల చింపి గుడ్డలూ, ఎదిగిన గడ్డమూ, మారురూపు పడేట్టు చేశాయి. చేతుల్లోని అరదండాలకు కాచినకాయలు మానిపోతున్నాయి. మా లచ్చిమి ఏడుపు పట్టలేక మామ బుగ్గలు తవుడుకొని భోరున యేడ్చింది. దిరసన్న కూడ గుండెచెదిరి కార్చిన కన్నీటిబొట్లు నల్లని గడ్డంలో ముత్యాలవలె మెరిసినాయి.

"మామా, తగల బెట్టింది నిజమేనా?" అని ఎవరూ యినకుండా అడిగింది మాలచ్చిమి.

"నీకుగూడా అనుమానమేనా! నీ తోడు, ఏ పాపం ఎరగను" అన్నాడు పెనిమిటి.

"ఏమవుద్దో?" అని కొంచం నిదానించి అడిగింది యిల్లాలు. "మన కెవరైనా సాచ్చం శపతారా? ఖామందు ఏమన్నాడు?" అని బదులు అడిగాడు భర్త.

దిరసన్న ఖామందు నాయుడోరు మొదట ఏమనుకున్నా పోలీసుల రాకట పోకట చూచి కొంచం భయపడ్డారు. "పెట్టుబడి గింజల్లోకి యనక ఇరుసుకుంటాలే. కొన్నాళ్లదాక మా యింటికి వస్తుండబాక. మేము చేయించినామని అనుమానపడతారు" అని తూమెడు గింజలు నాము లేకుండా యిచ్చి, నాయుడు తన మనస్సును కుదటపరుచుకున్నాడు.

"పోనీ కుప్ప సల్లార్చిన మన మాలోళ్లయినా శప్పరా?" అని దిరసయ్య ఆశతో అడిగాడు.

"చిన్నమాల రెడ్డోరు చెప్పారని మొన్ననే కట్టుబాటు చేశాడు. మన సంగంమాట కూడ పారడంలేదు."

ఇంతలో వార్డరు ఇద్దరినీ యేరుపరిచాడు. మాలచ్చిం కాళ్లు తడబడ్డాయ్. నాలుగైదుసార్లు యెనక్కి తిరిగిచూస్తూ పోయింది గేటు యలపలకి. పిచ్చోళ్ల కొట్టుల్లో ఉన్న ఒకరిద్దరు ఖైదీలు యెట్టినవ్వు నవ్వారు.

రేపు ఉరితాడు మెడకి పడబోతున్న ఒక నడివొయిసు మడిసి ఆఖరు సూపులు కోసరం దగ్గిర కొచ్చిన పెళ్లాం బిడ్డల్ని తడువుకొంటా యెక్కెక్కి యేడుస్తుండాడు. ఓ వార్డరు కుర్రాడు మాలచ్చిమిని వోర కంటితో సూస్తూ 'ఏవూరు?' అని యెచ్చరించాడు. పెద్ద మోటారుకారు నిండా ఉంకో జైలునుంచి మరికొంత మంది ఖైదీలు బదిలీ అయివచ్చి, సంకెళ్ల శేతుల్తో సొక్కాలు సరుదుకుంటూ దిగారు. లేగదూడల్ని పాలుకుడిపే జైలు బత్తెలు కనిపించే తల్కి మాలచ్చిం మళ్లీ మన పెపంచాని కొచ్చింది.

వాయిదానాడు దిరసయ్యను "సాక్షులున్నారా?" అని న్యాయాధిపతి చల్లగా అడిగాడు.

"దేవుడే దొరా నాకు సాచ్చి" అని ఖైదీ సమాధానం చెప్పాడు.

మేస్త్రీటు దిరసయ్యకు 6 నెల్లు విడి ఖైదు విధించి "ఇకపైన ఇటువంటి పని చేయబోకు" అని మందలించాడు.

దిరసయ్య బదులు చెప్పలేదు. కంట తడిపెట్టనైనా లేదు. జరిగిన దానికి యిచారించనూలేదు. కొంచెం దూరంలో నిలబడి శిచ్చయిని యేడుపు మింగుకుంటా "ఎక్కడికి బొయ్యేది మామా? ఏం సెయమంటావు మామా?" అని అడుగుతున్న మాలచ్చిమికి జవాబు కూడా చెప్పలేదు.

"సాక్ష్యం అట్లావుంటే నన్నేమి చేయమంటా?" అని న్యాయాధిపతి సమర్థించుకున్నాడు. "పెద్దరెడ్డి ఫిర్యాదు చేస్తే మమ్ములను మటుకు ఏం చేయమంటావు?" అని పోలీసు ఉద్యోగస్థులన్నారు. "నాదేఁదీ వకీలును" అని పోలీసు కుఱ్ఱ న్యాయవాది అన్నాడు. "ఎన్నాళ్లు ఈ పారిటీలతో యిగ్గులాడమంటావు?" అని నాయుడోరు అన్నారు. "ఆబోతు లాబోతులు తగూలాడుకుంటూ లేగల కాళ్లిరిచినాయి" అని చిన్నమాల అన్నాడు. "కూలీలకు గుణమొచ్చే దెప్పుడో?" అని కూలీల సంగం అన్నది.

"అయ్యో పాపం" అని ఇదంతా సూస్తుండిన డిపిటీ కలకటేరు బిళ్లా బంట్రోతు అన్నాడు, గుంపెడు బిడ్డలు కలవాడు కామట్టి.

పొద్దుగుంకిందాక జైలు యలపల యేడ్చియేడ్చి కండ్లు వాచిపోయిన మాలచ్చిమి ఊరివైపు ఒంటరిగా మళ్లింది. దారిమద్దె నిశీథియేళ కన్నీటి కాలవ అపుకోలేక ఏం సెయమంటావు మామా! ఎక్కడికి పొయ్యేది మామా! అని పెద్దగా అరిచింది. దిక్కులు అదే పెశ్నను పెతిధ్వనించినై. ఈ సప్పుడుకు ఉలిక్కిపడ్డ గుడ్లగూబ రివ్వున పైకెగిరింది. చెట్లకొనలమీద నిద్రోతున్న చిన్న కొంగలగుంపు కలకబారింది. దూరాన నక్కల అరుపులు, చేరువన చీకురాల ధ్వని ఎన్నడూ దూరాబారం పోయి యెరగని మాలచ్చిమిని బయపెట్టినై. ఆమెను ఎవరూ ఓదార్చలేదు.

కొన్నాళ్లకు రెడ్డోరు నాయుడోరు రాజీపడ్డారు. తడవ కొకరు జిల్లాబోర్డు నెంబరయ్యేట్టు తీరుమానం సేశుకున్నారు.

అవతల కొన్నాళ్లకు రెడ్డోరు నాయుడోరు ఖద్దరు గుడ్డలు కట్టుకొని గాంధి టోపీలు పెట్టుకొని పావలా చందాలు కూడా చెల్లించారు.

✸

నవోదయ, 24 ఫిబ్రవరి 1946.